## సునీతాలక్ష్మారెడ్డికి సన్మానం



సునీతాలక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి దంపతులు

బొల్లారం, డిసెంబర్ 6: నర్సాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సునీతాలక్ష్మారెడ్డిని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ రోజాబాల్‌రెడ్డి దంపతులు బుధవారం గోమారంలోని ఆమె నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు.

## చట్టాలు తెలుసుకోవాలి

సంగారెడ్డి, డిసెంబరు 6: విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్‌ను బంగారుమాయం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలను సందర్శించారు. భోజనాన్ని రుచి చూసి నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువులో రాణిం చాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

## బాలికల భద్రతకు చర్యలు

నారాయణఖేడ్, డిసెంబర్ 6: బాలికలకు విద్యతోపాటు భద్రత కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని సంగారెడ్డి జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారిణి సంధ్యారాణి అన్నారు. బుధవారం మహిళా సాధికారత సంస్థ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ కేజీబీవీ విద్యాలయంలో బేటీ పడావో– బేటీ బచావో కార్యక్రమంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సుజాత, ఎస్‌వో జ్యోతి, మహిళా సాధికారత సంస్థ జిల్లా సమన్వయకర్త పల్లవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప పాల్గొన్నారు. లింగాపూర్, ర్యాలమడుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన శ్రీమంతాల కార్యక్రమానికి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి సంధ్యారాణి హాజరయ్యారు. కార్యక్రమంలో సీడీపీవో సుజాత, సూపర్‌వైజర్ స్వరూప, ఎంపీటీసీ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ ఇందిర పాల్గొన్నారు.

## కోరంలేక వాయిదా..

హత్నూర, డిసెంబర్ 6: హత్నూర మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించాల్సి ఉండగా కోరం సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా పడింది. మండలకేంద్రమైన హత్నూర రైతువేదికలో ఎంపీపీ అధ్యక్షుడు వావిలాల నర్సింహులు అధ్యక్షతన ఏర్పాటుచేసిన మండల సమావేశానికి 16మంది ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాల్సివుండగా ఎంపీపీ నర్సింహులు, జడ్పీటీసీ ఆంజనేయులుతోపాటు ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం రెండుగంటలకు ప్రారంభం కావాల్సిన మండల సమావేశం మూడు గంటల వరకు ఎదురుచూసినా ఆశించిన స్థాయిలో ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో కోరంలేక గురువారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీవో శారదాదేవి తెలిపారు.

## ఆర్థికసాయం

బొల్లారం, డిసెంబర్ 6: పోచమ్మ బస్తీలో నివసించే ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంచన దేవి(50) క్యాన్సర్‌తో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ యువ నాయకుడు, సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు మృతురాలి కూతురు కాజల్‌కు అందించారు.

# అంబేద్కర్‌కు ఘన నివాళి

**భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రతిఒక్కరూ అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.**

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 6**



పటాన్‌చెరు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తదితరులు



సంగారెడ్డి కలెక్టరేట్: తారా కళాశాలలో అంబేద్కర్‌కు నివాళి



రామచంద్రాపురం: మ్యాక్స్‌సొసైటీ ఆధ్వర్యంలో..




సదాశివపేట: నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు




బొల్లారం: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రోజాబాల్‌రెడ్డి



పుల్కల్: నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ఝరాసంగం: అంబేద్కర్ విగ్రహం వద్ద..



అమీన్‌పూర్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



న్యాల్‌కల్: న్యాల్‌కల్‌లో బీఆర్‌ఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో..

# ఎమ్మెల్యే గూడెంకు అభినందనల వెల్లువ

గుమ్మడిదల, డిసెంబర్ 6: పటాన్‌చెరు ఎమ్మెల్యేగా గూడెం మహిపాల్‌రెడ్డి మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించడంతో ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తున్నాయి. బుధవారం మండలంలోని కొత్తపల్లి, నల్లవల్లి, రాంరెడ్డిబావి, నాగిరెడ్డిగూడెం గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు ఆంజనేయులు, డి.శంకర్, వాసవీదామోదర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, సత్తయ్య, శ్రీనివాస్‌ముదిరాజ్, ఫయాజ్ తదితరులు ఆయనను పటాన్‌చెరులో కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న కొత్తపల్లి గ్రామానికి చెందిన నాయకులు

## క్రాంతికిరణ్ పుట్టినరోజు వేడుకలు



అందోల్: బీఆర్‌ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నేతలు

అందోల్/రాయికోడ్/వట్‌పల్లి, డిసెంబర్ 6: అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ జన్మదిన వేడుకలను బుధవారం పార్టీ శ్రేణులు, అభిమానులు నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాలు, గ్రామాల్లో నాయకులు, ప్రజా ప్రతినిధులు కలిసి కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు.

## నిధులను సద్వినియోగం చేసుకోవాలి

కోహీర్, డిసెంబర్ 6: వాటర్‌షెడ్ పథకం ద్వారా కేటాయించిన నిధులను వినియోగించుకోవాలని సర్పంచ్ సుశీలమ్మ కోరారు. బుధవారం మండలంలోని బడంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాటర్ షెడ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వాటర్ షెడ్ పథకం ద్వారా బడంపేట గ్రామానికి రూ.నాలుగు లక్షలు మంజూరు అయ్యాయని వెల్లడించారు. గ్రామానికి కేటాయించిన నిధులతో బస్ షెల్టర్ నిర్మాణం, పశువుల సంరక్షణ షెడ్, తదితర పనులకు ఉపయోగించాల్సి ఉందన్నారు. కమిటీ సభ్యులు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కార్యదర్శి విజయ్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డిపో నిర్వహణపై ఆరా

నారాయణఖేడ్, డిసెంబర్ 6: సంగారెడ్డి ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం జ్యోత్స్న బుధవారం నారాయణఖేడ్ డిపోను సందర్శించారు. డిపో నిర్వహణ గురించి స్థానిక మేనేజర్ మల్లేశయ్యను అడిగి తెలుసుకున్నారు. డిపోకు రాబడి పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రతి బస్సును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే డిపో నుంచి పంపాలని సూచించారు. ఆమె వెంట మెకానికల్ ఇంజినీర్ దశరథరావు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

న్యాల్‌కల్, డిసెంబర్ 6: పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని మండలంలోని హద్నూర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం వైద్యాధికారి నైమిశా అన్నారు. బుధవారం స్థానిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పరిసరాల శుభ్రత, ఆరోగ్య, పోషక విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లికార్జున్, సువర్ణ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 6: స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం (ఎస్‌బీఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్‌బీఆర్‌ఎస్‌ఈటీఐ కార్యాలయం, 97044 46956, 94901 29839లో సంప్రదించి దరఖాస్తు ఫారాలను పొందవచ్చని పేర్కొన్నారు.

## నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 6: మన సాయుధ దళాలు దేశం కోసం నిరంతర త్యాగాలతో, ఉన్నతమైన బాధ్యలతో సేవలందిస్తున్నారని ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి సత్యశ్రీ బుధవారం ప్రకటనలో తెలిపారు. అమరులైన వారి కుటుంబాల సంక్షేమం, పునరావాసం కోసం సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 7న కలెక్టరేట్‌లో సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి మాజీ సైనికులు, సైనిక వితంతువులు, వారిపై ఆధారపడిన వారు, ప్రముఖులు హాజరుకావాలని కోరారు. సంగారెడ్డిలోని ఎన్‌సీసీ క్యాడెట్లు, మాజీ సైనికులు స్టిక్కర్లతో, కార్ ఫ్లాగ్స్, హుండీ బాక్స్‌లతో మీ ముందుకు వచ్చినపుడు విరివిగా విరాళాలు ఇవ్వాలని కోరారు.

## న్యాల్‌కల్ తహసీల్దార్‌గా భానుకిరణ్

న్యాల్‌కల్, డిసెంబర్ 6: న్యాల్‌కల్ తహసీల్దార్‌గా జె.భానుకిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బదిలీపై న్యాల్‌కల్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. గతంలో ఇన్‌చార్జిగా పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ మునీరొద్దీన్ పదోన్నతిపై వికారాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఝరాసంగం మండలం డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డికి మండల తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. అప్పటినుంచి ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో ఉన్నతాధికారులు భానుకిరణ్‌ను మండల తహసీల్దార్‌గా నియమించారు.

## చలితో ముసురుకుంది

న్యాల్‌కల్, డిసెంబర్ 6: తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న ముసురుతోపాటు ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరిగిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అకాశమంతా మేఘావృత్తమై చల్లటి గాలులు వీస్తుండటంతో ఇండ్లలో నుంచి బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు, కూలీలు పొలాలకు వెళ్లడం లేదు. చలి నుంచి రక్షించుకునేందుకు స్వెటర్లు, టోపీలు వంటి ఊలు దుస్తులు ధరిస్తున్నారు. ముసురు వానతో చేతికొచ్చిన పత్తి పంటకు నష్టం వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



తుఫాన్ ప్రభావంతో హద్నూర్‌లో కురుస్తున్న ముసురు